


ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైన్యం, ఎన్డీఆర్ఎఫ్‌తో కలిసి చేపట్టే సహాయక చర్యలపై శుక్రవారం హుస్సేన్‌సాగర్ తీరంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కండ్లకు కట్టినట్లు వివిధ అంశాలపై ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకున్నది.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 3 ఆగస్టు 2024 | HYDERABAD





ఏడు పడగల ఆదిశేషుడు.. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, సరస్వతి, లక్ష్మి, పార్వతి రూపాలతో ఖైరతాబాద్ గణపతి నమూనా



# వన మహోత్సవంపై నీలినీడలు!

## టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

### 3వేల ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అధికారుల ప్లాన్

### నిర్దేశిత లక్ష్యంపై తీవ్ర ప్రభావం

సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పచ్చదనం పెంపు పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రీనరీ పనులంటేనే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది హరితహారం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరిట పచ్చదనం పెంపునకు సంకల్పించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు రూ.30.81 లక్షల నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసి.. గత నెల 8న మంత్రుల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్కులు , రహదారుల వెంబడి..సెంట్రల్ మీడియన్, ప్రభుత్వ, కేంద్ర రంగ సంస్థల్లో విరివిగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే నిర్దేశిత టార్గెట్ కంటే ఎక్కువగా.. మొత్తం 50 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని ఖరారు చేసింది. ఇందులో భాగంగా అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు మొక్కలను నాటేందుకు ఒక్కో చోట రూ.5 నుంచి 10 లక్షలతో పనులను విభజించి టెండర్లను ఆహ్వానించారు. నగరవ్యాప్తంగా దాదాపుగా 3వేల చోట్ల పనులకు టెండర్లు పిలిచారు. అయితే ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. కొన్ని చోట్ల ఆరుసార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో చేసేది లేక అధికారులు ఏడోసారి టెండర్ వైపు వెళ్తున్నారు. బల్దియాకు సంబంధించిన పనులు చేస్తే సకాలంలో బిల్లులు రావన్న బలమైన వాదనల నేపథ్యంలో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారులే చెబుతుండటం గమనార్హం. అలాగే మేడ్చల్ జిల్లావ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమంలో 63 లక్షలు మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినా.. పూర్తయ్యేలా కనిపించడం లేదు.

**వన మహోత్సవ కార్యక్రమ నిర్దేశిత లక్ష్యాలు..**

| జోన్ | టార్గెట్ | పనుల పురోగతి |
|---|---|---|
| ఎల్బీనగర్ | 10,12,500 | 1,15,150 |
| చార్మినార్ | 6,42,500 | 1,54,049 |
| ఖైరతాబాద్ | 6,90,000 | 1,24,268 |
| శేరిలింగంపల్లి | 10,32,500 | 1,67,515 |
| కూకట్‌పల్లి | 10,12,500 | 1,43,993 |
| సికింద్రాబాద్ | 6,10,000 | 96,301 |

# సప్తముఖ మహాగణపతి

## 70 ఏండ్ల ప్రస్థానం • 70 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహం ప్రతిష్ఠాపన

ఖైరతాబాద్, ఆగస్టు 2 : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ సమయం రానే వచ్చింది. కోట్లాది మంది భక్తులకు కొంగుబంగారంగా నిలిచి ప్రతి ఏడాది భిన్నమైన రూపాలతో కనిపించే ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్నారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రస్థానంలో 1954 సంవత్సరంలో ఒక్క అడుగుతో మొదలై.. నేడు 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 70 అడుగుల ఎత్తులో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నారు.

### 70 అడుగుల ఎత్తు..

### 28 అడుగుల వెడల్పు

మహాగణపతి 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో దర్శనమిస్తారు. వీటితో పాటు కుడివైపు పది అడుగుల అయోధ్య బాలరాముడు విగ్రహం, ఎడమ వైపు తొమ్మిది అడుగుల ఎత్తులో రాహు, కేతుల విగ్రహాలు, మూడు అడుగుల మూషికాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కుడి వైపు 15 అడుగుల మండపంలో తొమ్మిది అడుగుల ఎత్తులో లక్ష్మి, శ్రీనివాసుడి విగ్రహాలు, ఎడమవైపు మండపంలో అంతే ఎత్తులో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

### సప్తముఖాల ప్రత్యేకతలివే..

ఏడు పడగల ఆదిశేషుడి నీడలో సప్తముఖాలతో ఖైరతాబాద్ మహాగణపతి కనిపిస్తారు. కుడివైపు ముఖాల్లో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఎడమ వైపు ముఖాల్లో సరస్వతి, లక్ష్మి, పార్వతి అమ్మవార్లు ఉంటారు. అలాగే రెండు వైపులా సప్తహస్తాలతో విభిన్నమైన ఆయుధాలను ధరించి స్వామి వారు దర్శనమిస్తారు. కుడివైపు చక్రం, పాశం, త్రిశూలం, పద్మం, శంఖం, అభయహస్తం, ఎడమ వైపు రుద్రాక్షమాల, పాశం, గ్రంథం, వీణ, కమలం, గద, మరో చేతిలో (మోదక హస్తం) ప్రసాదాన్ని పట్టుకొని ఉంటారు. స్వామి వారి కుడివైపు అయోధ్య బాలరాముడు, ఎడమ వైపు రాహు, కేతుల విగ్రహాలు, స్వామి వారి పాదల చెంత మూషికం ఉంటాయి. వీటితో పాటు ఉప మండపాల్లో శ్రీ శ్రీనివాసుడు, లక్ష్మీ కల్యాణంలో క్షీరసాగర మథనం, శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణంలో బ్రహ్మ, విష్ణు, నారద మహర్షిని వీక్షించవచ్చు.

### సప్త మాత్రుకల శక్తి స్వరూపుడై..



గౌరీభట్ల విట్టల శర్మ

బ్రహ్మణి, చాముండా, మహేశ్వరి, కౌమారి, వారాహి, ఇంద్రాణి, వైష్ణవి సప్తమాత్రుకలు. పురాణేతిహాసాల ప్రకారం ఆ సప్త మాత్రుకలు ఉద్భవించడానికి శ్రీ మాహా గణపతి మూల కారణంగా చెబుతారు. అంతేకాకుండా కాలమానంలో ఏడు రోజులు, ఈ సంవత్సరం వినాయక చవితి ఏడో శనివారం, ఏడో తేదీ (సెప్టెంబర్ 7)న ఉండటంతో పాటు ఏడు పడగలతో అదిశేషుడి నీడలో శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా (ప్రధాన విగ్రహంతో కలిపి) ఏడు ముఖాలతో ప్రతిష్ఠిస్తుండటం ఒక ప్రత్యేకతగా చెప్పవచ్చు. ప్రజలు, ప్రపంచం సుభిక్షంగా ఉండాలని, పాలకులు మంచి పాలన అందించేందుకు సప్తమాత్రుకలు శక్తిని ప్రసాదించాలన్న సంకల్పంతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. అలాగే స్వామి వారికి ఒక వైపు ఉండే రాహు, కేతులు విగ్రహాలను దర్శించుకుంటే సకల దోషాలు, అరిష్టాలు తొలగిపోతాయని, మరో వైపు బాలరాముడి విగ్రహం రామరాజ్యానికి ప్రతీకగా ఉంటుందని దివ్యజ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విట్టల శర్మ తెలిపారు. అలాగే ప్రస్తుత తరుణంలో యువతీ యువకులకు వివాహం జరుగడం లేదని, దేశ వ్యాప్తంగా బ్రహ్మచారిణులు, బ్రహ్మచారుల సంఖ్య పెరిగిపోయిందని, తల్లిదండ్రులు బాధపడుతున్నారని, ఈ నేపథ్యంలో ఉప మండపాల్లోని శ్రీ శ్రీనివాసుడు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణాలను దర్శించుకుంటే లోకకల్యాణంతో పాటు పెండ్లి కాని వారికి వివాహాలు జరుగుతాయన్నారు.

# దేశంలోనే హైదరాబాద్ బెస్ట్

## క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి • హైటెక్స్‌లో క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో




మాదాపూర్, ఆగస్టు 2: దేశంలోనే హైదరాబాద్ బెస్ట్ నగరమని క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో -2024కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ .. రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, ఆవిష్కరణలను పెంపొందించేందుకు క్రెడాయ్ హైదరాబాద్ ఎంతగానో కృషి చేస్తున్నదన్నారు. ఈ నెల 1న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో నిర్మాణ రంగం, తెలంగాణ అభివృద్ధి, 2050 వరకు ప్రభుత్వ ఆలోచనలను ఏ విధంగా పరిగణలోకి తీసుకొని అభివృద్ధి చేయాలనే విషయమై చర్చించినట్లు చెప్పారు. హైదరాబాద్‌ను టూరిజం, హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో రేవంత్ ప్రభుత్వం ఉందన్నారు. సామాన్యుల కల సొంత ఇంటితో నెరవేరుతుందని, సామాన్యులను సైతం దృష్టిలో ఉంచుకొని వారికి అందుబాటు ధరలో నిర్మాణాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రగతిలో క్రెడాయ్ భాగస్వామ్యమవుతుందన్నారు. ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా ప్రభుత్వం గుర్తించిందని, బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు కేటాయించిందని, ఈ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే కీలకమైన ప్రాంతీయ రింగ్ రోడ్డు డెవలప్‌మెంట్ కోసం రూ. 1525 కోట్లు, మెట్రో వాటర్‌వర్క్స్ రూ. 3385 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌కు రూ.500 కోట్లు, ఓల్డ్ సిటీ మెట్రో పొడిగింపునకు రూ. 500 కోట్లు, మల్టీ మోడల్ రవాణా వ్యవస్థ కోసం రూ. 50 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఐజీబీసీ చైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ . ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు కోసం రూ. 200 కోట్ల బడ్జెట్‌లో కేటాయించడంతో సీయూఆర్ కవర్ చేయడంతో పాటు ఈ ప్రాంతంలో విపత్తు నిర్వహణ కోసం ఒక సమీకృత యూనిట్‌గా పనిచేస్తుందన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారి విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించి, రక్షణ భూమి బదిలీకి ఆమోదం పొందేందుకు చేసిన కృషికి ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామన్నారు.

# ఎమ్మెల్యే 'దానం' కోసం.. నిరీక్షణ

ఖైరతాబాద్ బడా గణేశ్ మండపం రాజకీయాలకు వేదికగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. జూన్ 17న కర్రపూజతో మొదలైన డ్రామా విగ్రహ నిర్మాణ ప్రారంభం, నమూనా విడుదల వరకు హైడ్రామాగా మారింది. కర్రపూజ ముందే వైరుధ్యాలు నెలకొనగా, ఉత్సవ కమిటీలోని మరో వర్గం వేరే కుంపటి పెట్టుకున్నది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే, పలువురు నేతల జోక్యంతో ఈ గొడవకు కాస్త రాజకీయ రంగు పులుముకున్నది. ఒకానొక దశలో ఎమ్మెల్యే ముందే ఇరువర్గాలు కొట్టుకునేంత పనిచేశాయి. చివరకు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పడంతో పై పైకి ఓకే అన్నా....అంతర్గతంగా వైరుధ్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాస్తవానికి 1954 నుంచి సింగరి కుటుంబమే వారసత్వంగా మహాగణపతి బాధ్యతలను స్థానిక బస్తీవాసుల భాగస్వామ్యంతో నిర్వహిస్తూ వస్తోంది. కొందరు అసంతృప్త సభ్యులు తమకు సరైన ప్రాధాన్యతనివ్వడం లేదంటూ గొడవ పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా, ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నమూనా ఆవిష్కరణ సైతం రాజకీయాలకు వేదికగా మారిందంటున్నారు. గురువారమే విగ్రహ నమూనాను ఆవిష్కరిస్తామని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రకటించగా, ఎమ్మెల్యే దానం నాగేందర్ శుక్రవారం 1.30 గంటలకు పెట్టుకోవాలని..తాను వచ్చి ఆవిష్కరణ చేస్తానని చెప్పారు. దీంతో సరేనన్న కమిటీ.. అందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. చెప్పిన సమయానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ రావాల్సి ఉండగా, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాలేదు. ఎమ్మెల్యే రాక కోసం సుమారు తొమ్మిది గంటల పాటు నమూనాను ఆవిష్కరించకుండా ఉంచడంతో లైవ్ కవరేజీ కోసం పెద్ద ఎత్తున వచ్చిన మీడియా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సుమారు తొమ్మిది గంటల నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు రాత్రి 9.30 గంటల సమయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ విగ్రహ నమూనా విడుదల చేయడంతో ఈ కార్యక్రమాన్ని మమ అనిపించారు. అయితే ఎమ్మెల్యే కోసం తొమ్మిది గంటల పాటు కార్యక్రమాన్ని నిలిపివేయడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి.

### సీఎం ప్రకటనతో పోలీసు వర్గాల్లో

# చర్చ

### మద్యం మినహా అర్ధరాత్రి 1గంట వరకు షాపులు

సిటీబ్యూరో: ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం దుకాణాలు మినహా మిగతా వ్యాపార సముదాయాలు తెరుచుకోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం.. పోలీసు వర్గాల్లో చర్చకు దారితీసింది. రెండు నెలలుగా ట్రాక్‌లోకి వస్తున్న శాంతి భద్రతలు.. తిరిగి ఎలా మారబోతున్నాయనే ఆందోళన వారిలో నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హైదరాబాద్‌లో శాంతి భద్రతలు రోజు రోజుకూ దిగజారాయి. సెల్‌ఫోన్ స్నాచింగ్ మాఫియాకు తోడు.. అర్ధరాత్రి రౌడీషీటర్లు, వారి ప్రత్యర్థుల హత్యలు, ప్రతీకార దాడులతో నగరం అట్టుడుకింది. అధ్వానంగా శాంతి భద్రతలు మారాయంటూ తీవ్ర విమర్శలు రావడంతో పోలీసులు అర్ధరాత్రి ఆపరేషన్లు మొదలు పెట్టారు.

ఇందులో భాగంగా సెల్‌ఫోన్ స్నాచర్లపై కాల్పులు జరపడం, దుకాణాలను రాత్రి 10 నుంచి 11 గంటల వరకు మూసేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో లాఠీలకు పనిచెప్పి.. విమర్శలు ఎదుర్కొన్నారు. తాజాగా, ప్రభుత్వం అర్ధరాత్రి ఒంటి గంట వరకు దుకాణాలు తెరుచుకోవచ్చంటూ.. ఆదేశాలు జారీ చేయడంతో గత పరిస్థితి తిరిగి పునరావృతం అయ్యే ప్రమాదం ఉన్నదన్న ఆందోళన పోలీసు వర్గాల్లో నెలకొంది.



బాలానగర్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

### కుక్కల నియంత్రణకు

# ప్రభుత్వం చొరవ చూపాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 2 : వీధి కుక్కలను నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన 24 మంది బాధితులను శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ, బస్తీల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీటి నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు, చిన్నారులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. నగరంలో ఇటీవల వీధి కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కుక్కల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జీహెచ్ఎంసీ యంత్రాంగం వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పక్కాగా చేయాలని, వ్యాక్సినేషన్ ప్రక్రియను సవర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల కూడా వీధి కుక్కల నియంత్రణకు సహకరించాలని, ఆహార పదార్థాలను రోడ్ల పక్కన, చెత్త కుప్పల్లో వేయవద్దని, స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని కోరారు.

# చిన్నారితో విద్యార్థి అసభ్యప్రవర్తన

## లిటిల్ ఫ్లవర్ ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

ఉప్పల్, ఆగస్టు 2 : రెండో తరగతి చదువుతున్న చిన్నారిపై ఓ విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించాడు. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి విషయం చెప్పారు. దీంతో ఇరువురు పేరెంట్స్‌తో స్కూల్ యాజమాన్యం చర్చించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, తల్లిదండ్రులతో మాట్లాడి పంపించివేసిన విషయం తెలియడంతో ఇతర విద్యార్థుల పేరెంట్స్, వివిధ విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం పెద్దసంఖ్యలో పాఠశాలకు చేరుకొని నిరసన తెలిపారు. స్కూల్ ఎదుట ధర్నా చేసిన విద్యార్థి సంఘాల నేతలు..యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని, లక్షల్లో ఫీజులు వసూలు చేసే పాఠశాల యాజమాన్యం.. విద్యార్థుల భద్రతపై దృష్టిపెట్టడం లేదని ఆరోపించారు. విద్యార్థి సంఘాల నేతలు పాఠశాలలోకి దూసుకొచ్చేందుకు యత్నించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ జోసెఫ్‌ను వివరణ కోరగా, ఘటనపై విచారణ చేపట్టి, అసభ్యంగా ప్రవర్తించిన విద్యార్థికి టీసీ ఇచ్చి, పంపించి వేశామని స్పష్టం చేశారు.




పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు